క్లుప్తంగా

ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలి


అన్న క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: అన్న క్యాంటీన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. మంగళవారం నాగరాజుపేట, ముత్తరాసుపల్లె, జెడ్పీ అన్న క్యాంటీన్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికులు నిర్దేశించిన సమయానికి విధులకు హాజరుకావాలని, వారికి కేటాయించిన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ముత్తరాసుపల్లె వినాయక గుడి వెనుక ఉన్న చెత్త పాయింట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. జిల్లా పరిషత్ అన్న క్యాంటీన్‌కు వెళ్లి టిఫన్, భోజనాలు బాగున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : ప్రొద్దుటూరు మండలంలోని సీబీఐటీ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న వైష్ణవి మృతిపై సమగ్ర విచారణ జరిపి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యకు గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు చేస్తున్న అధిక ఫీజుల దోపిడీ అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షుడు వంశీ పాల్గొన్నారు.

నేడు పోస్టర్ డిజైన్ పోటీ

కడప కల్చరల్ : భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో బుధవారం కడప నగరంలోని బాలాజీ నగర్‌లోగల ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 10 గంటలకు విద్యార్థులకు సెలబ్రేటింగ్ ఇండియా పేరిట పోస్టర్ డిజైన్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ లయన్ కంబం చిన్నపరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తొలుత కెరీర్ గైడెన్స్‌పై సమావేశం నిర్వహిస్తారు. వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి.విశ్వనాథ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఇంటాక్ సభ్యులు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి గౌరవ అతిథిగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

ఆర్టీసీ ఎండీకి సత్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా మరోమారు బాధ్యతలు చేపట్టిన ద్వారక తిరుమలరావును కార్మిక పరిషత్ నాయకులు ఘనంగా సత్కరించారు. గతంలో ఆర్టీసీ ఎండీగా పనిచేసిన ద్వారక తిరుమలరావుకు ఇటీవల పదవీ కాలం ముగిసింది. అయితే ప్రభుత్వం మరోమారు ఆయనకు ఎండీగా నియమించడంతో మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎండీని విజయవాడలోని కేంద్ర కార్యాలయంలో కలిసిన కార్మిక పరిషత్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వై. శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి సురేంద్ర, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

8న శ్రీనివాస కల్యాణం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి, ఇతర భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 8న శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం ఆలయంలో ధర్మకర్త దేసు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి విలేకరుల సమావేశంలో ఆ వివరాలు తెలిపారు. తిరుమల–తిరుపతి దేవస్థానాలు తొలిసారిగా ఈ ప్రాంతంలో స్వయంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30 మంది వేద పండితులు కల్యాణాన్ని నిర్వహిస్తారని, కల్యాణ ఖర్చులన్నీ టీటీడీయే భరించడం విశేషమన్నారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ఆలయ రజతోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాలకు మరింత శోభ కలిగించేందుకు సాక్షాత్తు ఆ శ్రీనివాసుడే తమ ఆలయానికి కల్యాణ భాగ్యం కల్పించినట్లు భావిస్తున్నామన్నారు. రజతోత్సవాలలో భాగంగా 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. టీటీడీ కళాకారుల హరికథగానం, సంకీర్తనలు ప్రత్యేకంగా ఉంటాయన్నారు.

ఓం.. నమో వేంకటేశాయ..


రథంపై కొలువుదీరిన కడపరాయుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం


రథోత్సవం తిలకిస్తున్న భక్తులు


స్వామిని దర్శించుకున్న మేయర్ సురేష్‌బాబు, అంజద్‌బాష, పార్టీ నేతలు


స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి, శ్రీనివాసులురెడ్డి


తిరునాలలో చెరకుల విక్రయం


ఆకట్టుకున్న చిన్నారుల నాట్యం

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన రథోత్సవంలో జిల్లా ప్రథమ పౌరుడు, నగర మేయర్ కె.సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, తోటకృష్ణ, కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. రథంపై కొలువుదీరిన దేవతా మూర్తులను కూడా దర్శించుకున్నారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు, వేదాశీస్సులు అందజేశారు. అలాగే కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి కూడా కడప రాయుడు, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. రథంపై ఉన్న దేవతామూర్తులను దర్శించుకుని అర్చకుల ఆశీస్సులు, మంగళహారతులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో పాలెంపల్లె సుబ్బారెడ్డి, బాలిశెట్టిరవి, ద్వారకనాథరెడ్డి, యువరాజ్, కృష్ణారెడ్డి, శంకర్, రాజా పాల్గొన్నారు.

కడప రాయుడి సన్నిధిలో అన్నదానం


మేము సైతం సేవాసంస్థ ఆధ్వర్యంలో పానకం, అన్నదానం చేస్తున్న కడప చిన్నచౌక్ సీఐ ఓబులేసు, సభ్యులు


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర


పవన్ లక్ష్మి వెంకటేశ్వర టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం

కడప కార్పొరేషన్: శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానం(దేవునికడప)లో కడప నగరపాలక సంస్థ ఉద్యోగుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక పద్మావతి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరపాలక ఉద్యోగులు శ్రీనివాసులు, ఆర్‌ఓ కన్నయ్య, మేయర్ సీసీలు విశ్వనాథరెడ్డి, జి. శివకుమార్, వీరయ్య మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాల నుండి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తిరుణాల నేపథ్యంలో అన్నప్రసాద కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ చెన్నకేశవరెడ్డి, కుడా ఈఈ శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఉద్యోగులు రమేష్, సందీప్, కనకరాజు, రిటైర్డ్ ఫిట్టర్ సుబ్బారెడ్డి, శివ, నాగయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆ క్షేత్రంలో స్థానిక పవన్ లక్ష్మి వెంకటేశ్వర టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. దివంగత పుత్తా ప్రవీణ్‌కుమార్ రెడ్డి సంస్మరణగా వరుసగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 13వ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎం కేశవకుమార్, మురుగేశన్, కదిరి ప్రసాద్, పుత్తా సులోచనమ్మ, పుత్తా పవన్‌కుమార్‌రెడ్డిలు అతిథులుగా హాజరై స్వయంగా అన్నదానం చేశారు.

కడప అర్బన్: మేము సైతం సేవాసంస్థ 8వ వార్షికోత్సవం సందర్భంగా కడప నగరంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో జరిగే రథసప్తమి సందర్భంగా 2000 మంది భక్తులకు పానకం పంపిణీ చేశారు. 1000 మంది భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కడప చిన్నచౌక్ సీఐ ఓబులేసు విచ్చేసి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. సీఐ చేతుల మీదుగా పానకం, అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేము సైతం సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎంబాల్వింగ్ పరికరం ప్రారంభం


కడప రిమ్స్‌లో ఎంబాల్వింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ ఏ.సురేఖ

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అనాటమీ విభాగంలో నూతనంగా మంజూరు చేసిన ఎంబాల్వింగ్ మిషన్ ను ప్రిన్సిపల్ డాక్టర్ ఏ సురేఖ ఆవిష్కరించారు. ఈ మిషన్ ను ఉపయోగించి శరీరంలోకి రసాయనాలను పంపిస్తారు. దీని ద్వారా మానవ శరీరాలను భద్రపరిచి ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ కు ఉపయోగిస్తారు. ఈ మిషన్ ను మంజూరు చేయించినందుకుగాను ప్రిన్సిపల్‌కు అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సి యామినీ దేవి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, అనాటమీ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, ఎంబీబీఎస్ మొదటి సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కూటమి నేతలు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాకు చెందిన కూటమి పార్టీల నేతలు మంగళవారం జిల్లాకు వచ్చిన ఇన్‌ఛార్జి మంత్రి సవితను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే కాలంలో జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, అందుకు అందించాల్సిన తోడ్పాటుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి, ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగళ శశిభూషణ్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, బద్వేలు నాయకురాలు విజయమ్మ, రితిష్ రెడ్డి, బీజేవైఎం కడప జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జియాలజీ విద్యార్థులకు ప్రశంస


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఆచార్య రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: హైదరాబాద్ నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ (ఎన్.జి.పి.ఆర్.ఐ)లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకొన్న వైవీయూ జియాలజి శాఖ విద్యార్థులను యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ అభినందించారు. ఎన్.జి.పి.ఆర్.ఐలో అప్రెంటిషిప్ కోసం దేశవ్యాప్తంగా 400 మంది దరఖాస్తు చేయగా ఆ సంస్థ 20 మందిని ఎంపిక చేసిందని అందులో వైవీయూ నుంచి జియాలజి విద్యార్థులు సత్యనాగ వరప్రసాద్, జి. విజయ శివ గణేష్, ఎం. కిరణ్ కుమార్ ఉన్నారు. 8 వారాలపాటు శిక్షణ పూర్తి చేసుకొని విశ్వవిద్యాలయాని కి వచ్చిన సందర్భంగా వారిని మంగళవారం అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జియాలజి విభాగాధిపతి ఆచార్య వి. సునీత, ఆచార్య కె. రఘుబాబు, ఆచార్య ఎస్.జయరాజు, సహ ఆచార్యులు డా.ఎస్ శ్రీ నివాసగౌడ్ పాల్గొన్నారు.

పార్టీ నుంచి పంపేయడానికి కుట్ర

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి అనుచరులపై ఫిర్యాదు
- ఇంచార్జి మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకెళ్లిన 47వ డివిజన్ ఇంచార్జ్ కొండ్రెడ్డి జనార్దన్ రెడ్డి


మంత్రి సవితమ్మకు వినతిపత్రం ఇస్తున్న కొండ్రెడ్డి జనార్దన్ రెడ్డి, పక్కనే ఉన్న శ్రీనివాసులు రెడ్డి

కడప రూరల్: కడప నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో ఒకరంటే మరొకరికి ఏమాత్రం సరిపోవడం లేదు. తమ్ముళ్ల మధ్య ఐక్యత సంగతి అటుంచితే వర్గ పోరు రాజ్యమేలుతోంది. జిల్లా ఇంచార్జి మంత్రి సవితమ్మ కడప నగరానికి మంగళవారం వచ్చిన నేపథ్యంలో కడప నగరం 47వ డివిజన్ ఇంచార్జి కొండ్రెడ్డి జనార్దన్ రెడ్డి ఈ మేరకు ఆమెకు ఫిర్యాదు చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి సమక్షంలోనే ఆయన అనుచరులపై ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. 47వ డివిజన్‌లో టీడీపీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని తెలిపారు. అయితే స్వయాన పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి కి చెందిన 6 మంది అనుచరులు పార్టీ నుంచి తనను బయటకు పంపడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. అందులో ఒకతను పార్టీకి, డివిజన్ కు దూరం చేయాలని తనపై కథలు అల్లి 47 డివిజన్ ఇంచార్జిగా మరో వ్యక్తిని నియమించినట్లుగా ప్రచారం చేస్తున్నారని వాపోయారు. అలాగే డివిజన్ ఇంచార్జిగా తనను తొలగించినట్లు చెప్పుకుంటున్నారని అన్నారు. ఈ విషయమై పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డిని అడగగా అందుకు ఆయన ఎవరినీ ఇంచార్జిగా ప్రకటించలేదని, వారు ఎవరో అనధికారికంగా ఇంచార్జిగా ఫ్లెక్సీలు వేసుకుంటున్నట్లు సమాధానం ఇచ్చారన్నారు.

పార్టీలో జరుగుతున్న ఈ పరిణామాలు తనను మానసిక వేదనకు గురి చేస్తున్నాయని కొండ్రెడ్డి జనార్దన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రచారాలను చేస్తున్న వారిపై న్యాయబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రిని కోరారు. కాగా ఈ అంశం ఆ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పోలీస్ సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి


కడపలోని పోలీస్ జిమ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

కడప అర్బన్ : పోలీస్ సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పలు విభాగాలను ఎస్పీ పరిశీలించారు. పోలీస్ ట్రాన్స్ పోర్ట్ విభాగాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కల్పతరు పోలీస్ వెల్ఫేర్ స్టోర్స్ సూపర్ మార్కెట్ ను సందర్శించి అందులో లభించే కిరాణా, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల గురించి ఆరా తీశారు. అనంతరం పోలీస్ జిమ్‌ను సందర్శించి అందులోని పరికరాలను పరిశీలించారు. పోలీస్ సంక్షేమం లో భాగంగా నిర్వహిస్తున్న పుష్పగిరి గ్యాస్ ఏజెన్సీ ని పరిశీలించారు. పోలీస్ సంక్షేమ ఆస్పత్రి ని పరిశీలించారు. ఆస్పత్రి వైద్యురాలు డా.మేరీ సుజాత ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్ ను సందర్శించి పలు సూచనలు చేశారు. బెల్ ఆఫ్ ఆర్మ్స్, బాంబు డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ జాగిలాల గురించి ఆరా తీశారు. అనంతరం ఉమేష్ చంద్ర స్మారక కల్యాణ మండపాన్ని పరిశీలించారు. ఎస్పీ వెంట ఆర్‌ఐలు టైటస్, ఆనంద్, వీరేష్, సంబంధిత విభాగాల సిబ్బంది ఉన్నారు.

సేవలను మరింత చేరువ చేయాలి


మాట్లాడుతున్న ఎన్‌జి రంగా విశ్వ విద్యాలయ విస్తరణ సంచాలకులు శివ నారాయణ

కడప అగ్రికల్చర్: కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ సేవలను రైతులకు మరింత చేరువ చేయాలని గుంటూరు యన్‌జి రంగా విశ్వ విద్యాలయ విస్తరణ సంచాలకులు డా. జి. శివ నారాయణ పేర్కొన్నారు. మంగళవారం కేవీకేలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయం సంక్షోభంలో ఉందని, వాతావరణం మార్పులకు గురవుతోందన్నారు. అందుకు అనుగుణంగా వాతావరణాన్ని తట్టుకునే రకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, అందుకోసం కేవీకే కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కేవీకేలు రైతుల స్థితిగతులను మార్చడానికి తోడ్పడతాయని అన్నారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డా. వి. సుమతి , కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్‌లు పలు సూచనలు చేశారు. 2025–26 సంవత్సరానికి చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళికలను వివరించారు.

ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, అన్నమయ్య జిల్లా పశుసంవర్థక అధికారి ,డా.గుణ శేఖర పిళ్ళై, పులివెందుల అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. శివ రామ క్రిష్ణ, వనిపెంట కేవీకే సమన్వయకర్త , డా. యం. బాల క్రిష్ణ, ఊటుకూరు వ్యవసాయ పరిశోధనస్థానం అధినేత జి. ప్రభాకర్ రెడ్డి, రైతు శిక్షణా కేంద్రం, వ్యవసాయ సహాయ సంచాలకులు రమణారెడ్డి, కడప, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో పాటు కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రార్థనలతోనే దైవ కృప సాధన


ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు


దైవ సందేశాన్ని అందజేస్తున్న రెవరెండ్ ఫాదర్ ఆరోగ్యస్వామి

కడప కల్చరల్ : ప్రార్థనల ద్వారానే దైవ కృపను సాధించవచ్చని పులివెందుల విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ లక్కినేని ఆరోగ్యస్వామి అన్నారు. లూర్దుమాత నవదిన కార్యక్రమాల్లో భాగంగా మూడవరోజు మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు మరియాపురంలోని పెద్ద చర్చి ఆవరణలో విశేష ప్రార్థనలు చేశారు. తొలుత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీపై లూర్దుమాత స్వరూపాన్ని నిలిపి విశ్వాసులు ఊరేగింపుగా మరియాపురం వీధుల ద్వారా స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రధాన ప్రార్థనా వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆ స్వరూపాన్ని వేదికపై ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆరోగ్యస్వామి మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తును తల్లి లూర్దుమాత ప్రార్థనల ద్వారానే క్రీస్తు ప్రేమను సాధించగలిగిందని తెలిపారు. విశ్వాసులు తమ కోరికలను ఆ మాత ద్వారా దైవానికి తెలుపవచ్చని, ఆమె ద్వారానే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. పోరుమామిళ్ల డీన్ గురువులు రెవరెండ్ ఫాదర్ విజయభాస్కర్ దివ్య బలిపూజ నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా పీఠాన్ని అలంకరించి స్తుతి గీతాలను ఆలపించిన కారుణ్య సంఘం సభ్యులు ప్రధాన ఆకర్షణగా నిలిచారు.